# పేరంటాల ప్రఖ్యాతి

"దీపావళి ఇరవై రోజులే ఇక. ఇంకా క్రొత్త బట్టలు తీయలేదు. స్వగతంలాగా అన్నది పైకే కాఫీలు కలుపుతూన్న సుశీల.

"ఈరోజు సాయంత్రం వెళదాం. అంతా ఇంటిదగ్గరే వుండండి. మళ్ళీ నా సెలెక్షన్ నచ్చకపోతే పేచీలు పెడ్తారు" అన్నది తిరిగి.

రెండవసారి కూడా తన మాటలకు జవాబురాక విసుగ్గా తలెత్తి చూసింది. ఎదుటి గదిలోనే వున్నారు భర్తా, పిల్లలూ అంతాకూడా.

"అరె! ఎవ్వరికీ విన్పించనే లేదా నా మాట? వచ్చి కాఫీలు త్రాగిపోండి."

"అబ్బ! మేం సీరియస్‌గా ఆలోచిస్తున్నాం. మమ్మీ నువ్వే తెచ్చిపెట్టు. ప్లీజ్!" అన్నది లక్కీ.

"సెలవుల్లో కూడ ఒక్క పని సాయం లేకుండా నా ప్రాణాలు తీస్తారుగదే అంతా ఒకటై!"

కాఫీ కప్పులు విసుక్కుంటూ అందిస్తూన్న తల్లిని సీరి

యస్‌గా చూశాడు బాబి. "అబ్బ మేం 'యమ' సీరియస్‌గా ఆలోచిస్తూంటే నీ డిస్ట్రబెన్స్ ఏమిటి మమ్మీ మధ్యన?"

"ఏమిట్రా నీ సీరియస్‌నెస్? చదువుల్లో ఆఖరి మార్కు తెచ్చుకొనే బుఱ్ఱలో ఏమంత గొప్ప ఆలోచనలు పుట్టగలవ్, నా కర్థం కాక అడుగుతాను?"

"మమ్మీ!" బాబి స్వరంలో కోపం. "బట్టీపట్టి ఫస్టులు తెచ్చుకొనే వెధవ పుస్తకాల పురుగులపై నీకంత గౌరవ మెందుకో నాకు తెలియదు. చదువును మించిన గొప్ప పనులు చాలా వున్నాయి ప్రపంచంలో!"

"అవేమిటో చెప్పు నాయనా కాస్త వింటాను." సుశీల స్వరంలో హేళన.

"బీసీ' నాటివాళ్ళకి చెప్పినా అర్థం కాదులేకానీ, నీపనులు నువ్వు చూచుకుంటూ మమ్మీ." బాబీకి సపోర్టుగా రోజీ అన్నది.

"ఏం చదువులు చదువుతున్నారే — ఒక్కొక్కళ్ళకీ మాటతీరూ, మన్ననా కూడా తెలిసి ఏడవడంలేదు." అంటూ ఆ కోపమంతా భర్తపైకి త్రిప్పింది సుశీల.

"జరుగుతూన్న భాగోతం ఏమైనా విన్పిస్తోందా లేదా? ఎంతసేపూ ఆ పేపరు మొహాన వేసుక్కూర్చుంటారు."

"వింటూనే వున్నానులే అంతా." మొహానికి అడ్డుగా వున్న వార్తాపత్రిక తీయకుండానే సెలవిచ్చాడు సింహో ఉరఫ్ నరసింహారావు, ఎమ్మెయీ.

"పిల్లలమాట అబద్ధమేమీకాదు."

"ఏమిటీ? అబద్ధంకాదూ ? నేను 'బీసీ'నాటి దానననే మీ ఉద్దేశ్యం కూడానా ? అయితే, ఇదంతా మీరే నేర్పి నట్టున్నారు వాళ్ళకి, ఆదివారం పూటా తీరికగా యింట్లో కూర్చుని."

"నోనోనో !" ఖంగారుపడిపోయాడు సింహా. "అది కాదోయ్ డార్లింగ్ ! ప్లీజ్ నో మిస్సండర్ స్టాండింగ్స్, నేనన్న దేమిటంటే...చదువుకంటె గొప్పవిషయాలు చాలా వున్నాయనేది నిజమని !"

"అయితే ఏమిటవి ?" తీక్షణంగా అడిగింది, "కాస్త సెలవివ్వండి నేనూ వింటాను."

తల్లి కోపావతారాన్ని, తండ్రి సంజాయిషీ యిచ్చే తీరునూ తమాషాగా చూస్తూన్న సంతానం నవ్వాపుకోవ టానికి మహా తంటాలు పడ్తున్నారు.

రోజీ సైగ చేయడంతో బాబీ ముందుకు వచ్చాడు :

"మమ్మా, అంతమాత్రం 'ఇంట్రెస్టు' నీకుంటే నేను చెప్తాను విను. డాడీకి 'ఎక్స్‌ప్లయిన్' చేయటం-అదే అదే... అర్థమయ్యేట్టు చెప్పడం చేతరాదు."

"చేతరాదేమిటి బోడి భాష ? చేత కాదన్లేవ్ ?"

"అది సరే. లీవిట్, అసలు 'టాపిక్' కొద్దాం. ఇలా ఏదో ఓమూల ఇంత విస్తారమైన దేశంలో అనామకులల్లే పడి

వుండటం మాకు బాగులేదు. గొప్ప వాళ్ళమవ్వాలంటే ఏం చేయాలా అని మేం ఆలోచిస్తున్నాం."

"ఏమిటీ ? ఇప్పుడు మనం చక్కగా బ్రతకడంలేదూ? ఇంత గొప్ప ఉద్యోగస్థులు మీనాన్న, ఇంకా మీకు తృప్తి లేదూ ? ఇంకేం కావాల్రా సిగ్గులేక ?"

"ఓ ! స్టూపిట్ మమ్మీ. గొప్ప అంటే అదికాదు! పేరు ! పేరు సంపాదించాలి !"

"ఔను మమ్మీ" అప్పటికి ధైర్యం వచ్చిన లక్కీ ముందుకొచ్చింది.

"చూడూ కొందరు దేశసేవ...కొందరు ప్రజాసేవ... కొందరు కళాసేవ...ఇన్ని విధాలుగా ఖ్యాతి సంపాదిస్తున్నారు. మరి మేమూ ఏదోమార్గం వెతకాలి కీర్తి పొందాలంటే."

"చూశావా, అనవసరంగా విసుక్కున్నావ్ కానీ నీ పిల్లలదెంత గొప్ప ఆదర్శమో!" సింహో గర్వంగా అన్నాడు.

"చాల్లెండి. ఉట్టికెగరలేనమ్మ స్వర్గాని కెగిరిందట. ఒక్కొక్కళ్ళు కాస్త ఆ డిగ్రీచదువు గట్టెక్కించలేక డింకీలు కొడుతున్నారు. పేరు సంపాదిస్తారట పేరు !"

"అదుగో మళ్ళీ మొదటికొచ్చావ్." రోజీ గునిసింది.

"చదువో చదువో అనకు మమ్మీ ఖర్మ! గొప్ప గొప్ప వారిలో చాలమంది వేలిముద్ర గాళ్ళేనని నీకు తెలియదా?"

"ఆఁ! మంచి అయిడియా !" లక్కీ ఎగిరి గంతేసింది. "అంచేత మనం ఇప్పటికే చాలా టైం వేస్ట్‌చేశాం చదువూ

పాడూ అంటూ. ఇక గొప్పతనం రావటానికి పథకం తొందరగా ఆలోచించాలి."

"చదువును నిందించి బాగుపడ్డట్లే ఇక..."అని గొణుగుతూన్న తల్లిమాటలను విన్పించుకునేదెవరు ?

"అయిడియా! అయిడియా !" అన్నది రోజీ చిటికెలు వేస్తూ గంతులువేస్తూ.

"త్వరగా, త్వరగా చెప్పేయ్ !" లక్కీ, బాబీ ఆత్రతగా అడిగారు, ఆమె చెరోచేయిూ పట్టుకుని తామూ నాట్యంచేస్తూ.

"ఏదో ఒకపని. పదిమందిలో సంచలనం రేకెత్తించేది చేయాలి. అంతే. మనపేరు పదిమందికీ తెలుస్తుంది. 'ఫలానా వారి నాయకత్వాన అక్కడ అది జరిగింది—ఇక్కడ ఈ విశేషం జరిగింది' - అంటూ పత్రికలు వ్రాసేస్తాయి."

"అక్షరాలా నిజం. కానీ ఏం విశేషం లేవదీద్దాం?" బాబీ సందేహం "ఒకళ్ళుచేసినవి కాదు. మనం పూర్తిగా క్రొత్తపంథాలో నడవాలి."

మఱలా ముగ్గురూ అయిదునిముషాలు మౌనంగా ఆలోచనలో గడిపినతర్వాత బాబీ అన్నాడు గర్వంగా:

"స్వతంత్రపోరాటం, ప్రత్యేకరాష్ట్రం వగైరా వగైరా అన్నింటికీ ఎవరో ఒకరు సత్యాగ్రహాలూ, అల్లర్లూ జరిపేశారు. అంచేత ఇక ఆ పాత చింతకాయపచ్చళ్లు మనకొద్దు."

"మరి ?" సోదరీమణులిద్దరూ ఒకేసారి ప్రశ్నించారు.

"చెప్తున్నాగా ? ఇప్పుడు వస్తూన్న దీపావళి పండగే తీసుకుందాం. ఎంత ఖర్చు ! ఉదయం పిండివంటలతో ప్రారంభమై రాత్రి అన్నీ తగలబెట్టడాలతో అంతమౌతుంది. క్రొత్తబట్టలు సరేసరి. ఈ ఖర్చులన్నీ భరించలేక, అటు భార్యా బిడ్డలను అసంతృప్తితో వదలనూలేక ప్రతి యజమానీ ఏడుస్తూనే వుంటాడు, ధనవంతులు తప్ప. అంచేత ఇవన్నీ ఆపివేయాలని మనం అందరికీ బోధించాలి ఇల్లిల్లూ తిరిగి."

"అప్రాచ్యుడా ! పండుగఖర్చు సంతోషంగా పెట్టుకుంటారు కానీ ఏడవట మేమిటిరా ?" సుశీల కోపంగా మందలించింది.

"మమ్మీ ! ఇవన్నీ నీకర్థంకావు. నీవు 'బీసీ'నాటి పతివ్రతవని ముందే విన్నవించుకున్నాం. ప్లీజ్ గో అండ్ లుకాఫ్టర్ యువర్ కిచెన్. ప్లీజ్ !"

"ఎలాగో అఘోరించండి. పండగలూ పబ్బాలూ చేసుకోవద్దని తప్పుడు ప్రేలాపనలు పేలితే దేహశుద్ధి చేసి పంపిస్తారు ఇంటింటా. భగవంతుడిచ్చిన కాళ్లూ చేతులూ సక్రమంగా వుంచుకోనే యోగం లేనట్లుంది మీకు" రుసరుసలతో అక్కడినుండి వెళ్ళిపోయిందే కానీ, ఇక్కడ జరుగుతూన్న మంత్రాంగమంతా ఆమెకు తు. చ. తప్పకుండా వినపడుతూనే వున్నది.

"వ్వాటెపిటీ డాడీ! మమ్మీని మీరింత అన్ కల్చర్డ్‌గా ఎందుకు వదిలేశారు?" లక్కీ అసహనంగా అడిగింది.

"మా పెళ్ళికాగానే బాబ్డ్ హెయిర్ చేయించి, ఇంగ్లీష్ స్కూల్స్‌కు పంపాల్సింది మమ్మీని! ఇంతంత పొడుగు జడలూ, లేదా తట్టంత సిగలూ, వీటితోనే వాళ్ల తలలు బరువెక్కిపోయి మెదడు మొద్దుబారిపోయి బొత్తిగా అభ్యుదయమైన ఆలోచనలు కలిగే అవకాశం లేకుండా పోతున్నది." అన్నది రోజీ గర్వంగా తన బాబ్డ్ హెయిర్ సవరించుకుంటూ.

మసాలా నూరుతున్న సుశీల పుత్రికామణుల మాటలు విని పళ్ళు నూరుకోవటం గమనించిన సింహా కొంటెగా నవ్వుకున్నాడు. పిల్లల విమర్శలు అదే ధోరణిలో సాగితే సుశీల ఆగ్రహం అధికంకాగలదని భయపడ్డాడతడు.

"మీ అమ్మమాట కూడా నిజమే! బొత్తిగా మతం జోలికి సాంప్రదాయాల జోలికి వెళ్ళామంటే అవయవాల క్షేమం అనుమానమే మరి!"

ఈమాటలు విని సంతానం ముఖాలు చిన్నబోయాయి. ఇక మళ్ళీ ప్లేటుమార్చక తప్పిందికాదు సింహాకు. "అఫ్‌కోర్సు మీ వాదనలలో కూడా కొంత నిజం లేకపోలేదు." ఈ మాటలకు పిల్లలముఖాలు వికసించడం చూచి ఉత్సాహంగా చూచాడు సింహా. తన ఉపన్యాసాన్ని పొడిగించాడు.

"పండగల పేరిట అనవసర ఖర్చులు చాలా జరుగుతున్నాయి. మన బీద దేశంలో నిజంగా ఇటువంటివి చాలా తప్పు."

"అంతేకాదు." లక్కీ ఉత్సాహంగా అందుకున్నది. "దసరా చూడండి - రావణుని మర్డర్ చేసినరోజు...అలాగే దీపావళి- నరకాసురుడో బకాసురుడో ఎవడిదో మర్డర్..."

ఇక వుండబట్టలేని సుశీల వంటింటినుండి గట్టిగా అదిలించింది-"ముందు నువ్వు తెలుగు భాషనే మర్డర్ చేస్తున్నావనేది తెల్సుకో. ఈ తప్పుల తడికలన్నీ వినలేక ఛస్తున్నాను!"

లక్కీ ఏం తగ్గలేదు. "నువ్వు వినరాదనే మా రిక్వెస్ట్ కూడా... ఆఁ డాడీ- ఏం చెప్తున్నానూ- మన పండగలన్నీ ఎవడో ఒకడు చచ్చిన రోజులే. ఈ లెఖ్ఖన మన ప్రజ బ్రతికినన్నాళ్లూ ఆ 'జెయింట్స్'గాళ్లు పెట్టిన బాధ లనుభవించడమేగాక, వాళ్లు చచ్చాకకూడా చచ్చినట్లు వాళ్ళ తద్దినాలు పెడ్తున్నారన్నమాట ఇంతింత ఖర్చులతో!"

"వండర్ ఫుల్! వండర్ ఫుల్ కామెంట్ లక్కీ!" సింహో మెచ్చుకోలుగా చప్పట్లు కొట్టాడు. "నా కూతుర్నని పించావ్!"

"రియల్లీ యూ ఆర్ కరెక్ట్ లక్కీ!" బాబీ అన్నాడు. "సీ అర్గ్యుమెంటునుంచి మనం మరోపాయింటు తీసుకోవచ్చు!"

"వ్వాటీజిట్? క్విక్ క్విక్!" రోజీ ఆత్రత.

"రాముడు నరకాసురుని చంపాడు, కృష్ణుడు రావణుని చంపాడు, దుర్యోధనుణ్ణి కర్ణుడు చంపాడు..."

వంటింటి తలుపులు భళ్ళునశబ్దంతో మూసుకున్నాయి. సుశీల నిరసనకు నిదర్శనంగా.

కానీ ఆ క్రోధం ఎవరిమీద పనిచేయలేదు. తమలో తాము నవ్వుకున్నారు.

"నువ్వు బొత్తిగా పురాణ కథలను తలక్రిందులుగా చేసి మాట్లాడ్తున్నావ్, నరకాసురుని కృష్ణుడు చంపాడు, రావణుని రాముడు చంపాడు. నీ తప్పులువిని మీ అమ్మకోపం ఎక్కువైంది." అన్నాడు సింహా.

"పోనిద్దురూ! ఎవళ్ళో ఒకళ్ళూ." బాబీతీసి పారేశాడు తండ్రి మాటను.

"మీకు మహా తెలిసినట్టు!" వంటింట్లోనుండి రయ్యిన వినవచ్చింది సుశీలకంఠం. "నరకాసురుని సత్యభామ చంపింది!"

"ఓ! సారీ! ఎక్స్క్యూజ్ మీ." భార్యకు విన్పించేట్లుగా చెంపలు వాయించుకున్నాడు సింహా. "ఆడవారి హక్కుల సంవత్సరంకూడా జరిగిందాయె ఈమధ్య"

"ఇంతకూ నా పాయింటు!" బాబీ అసలు విషయానికొచ్చాడు. "జాగ్రత్తగా వినండి. ఏదో ఒకపని ఆర్భాటంగా చెయ్యటమే కావాలి. అది గొప్పపనే కానక్కర్లేదు. దాంతో మనిషికి పేరు ప్రతిష్ఠలు వచ్చేస్తాయి. నా ఉద్దేశ్యమేమిటంటే అసలు మంచిపని చేసేవాళ్ళకంటె చెడ్డవాళ్ళకే ఎక్కువ పేరు."

"అదెలా?"

"ఎందుక్కాదూ? రావణుడూ దుర్యోధనుడూ-

వాళ్లకెంతెంత పేరు ప్రతిష్ఠలు! పుస్తకాల్లో శాశ్వతమై పోయారు అసలు హీరోలకంటె. ఆమధ్య అదేదో సినిమాలో రంగారావ్ రావణరూపంతో ఎంత హుందాగా వున్నాడు! కళ్ళెదుట కన్పిస్తే కాళ్ళమీదపడిపోయి శిష్యుడినైపోయి వుండేవాడిని!"

"నిజమే. అయితే ఏంచేద్దాం?"

"చెప్తున్నా, నేనంతా ముందే ఆలోచించిపెట్టాను. మనం ఆ రాక్షసుల మాదిరిగా చెడ్డపనులు చేద్దామనే ఉద్దేశ్యంలేదనుకో. ఊరికే అభిప్రాయం చెప్పానంతే!"

"అబ్బ! ఏం 'సస్పెన్సు'రా అసలుసంగతి చెప్ప కుండా?" రోజీ, లక్కీ విసుక్కున్నారు.

"ఒరేయ్! నట్టింట తీరుబడిగా కూర్చుని పుణ్య గ్రంథాలను తిట్టకు. బయటకెక్కడికైనాపోయి చేసుకోండి ఆ సభలు. ముష్టిరెండూ రాలగొట్టి పంపుతారు విన్న వాళ్లు!" సుశీల ఉరిమింది ఎదుటి గదిలోనుంచి.

"ఆ భయం నీకొద్దు మమ్మీ. నేను దేనినీ తిట్టటంలేదు. సంగతి చెప్పానంతే. మమ్మల్నే చూడు. ఎంత అజ్ఞానంలో వున్నామో- మన పురాణాలు చరిత్రలూ ఏమిటో ఏమీ తెలియడంలేదు. అంచేత ఇవన్నీ ఎవరూ మర్చిపోకుండా ఇవి కూడా స్కూళ్ళల్లో కాలేజీల్లో పాఠ్యగ్రంథాలుగా చేయాలి. ఈ ఇంగ్లీషుకు పూర్తిగా స్వస్తిచెప్పి తెలుగులోనే చదువులు

సాగాలి బియ్యేవరకూ ఎమ్మేవరకూ కూడ! ఇలాంటి ఆందోళన లేవదీస్తే గొప్పగావుండదూ?"

"బలేగా వుంటుంది" రోజీ, లక్కీ మద్దత్తుగా పలికారు. "ఇంగ్లీషు బుఱ్ఱలకెక్కక బాధపడే అందరి మద్దత్తూ మన కుండనే వుంటుంది!"

"ఏమంటారు డాడీ?" ముగ్గురూ ఏకకంఠంతో అడిగారు.

"బాగానే వుంటుంది. ఈ నినాదం ఇదివరకే ప్రారంభ మైంది కానీ పూర్తిగా అమలులోకి రాలేదు. ఇప్పుడు మీరు నడుం కట్టండి."

సింహా నిశ్చలంగా పలికినతీరు అరికాలి మంటను నెత్తి కెక్కించగా సుడిగాలిలా వచ్చింది సుశీల ఆ నలుగురి నడుమకూ.

"ఏమిటీ? మీరు కూడా వాళ్ల వక్రబుద్ధులకు మద్దత్తు పలుకుతున్నారా?" నిలదీసి అడిగింది భర్తను.

"డోంట్ బి ఎఫ్రైయిడ్!" నిమ్మకు నీరెత్తినట్లున్న దలడి ధోరణి: "పిల్లల ఉత్సాహానికి పెద్దవాళ్ళు మరీ అడ్డు కట్టలు వేయరాదు. వాళ్ళకి స్వతంత్రంగా ఆలోచించే శక్తినీ, అదృష్టాన్ని పరీక్షించుకొనే అవకాశాలనూ కలగనీయాలి. స్కూళ్లు పిల్లలకు జైళ్ళవంటివి అన్నాడు ఓ మహాకవి. ఎవరే విధంగా పైకొస్తారో చెప్పలేంకదా!"

"ఔను మమ్మీ. నువ్వు మా కడ్డురాకు మమ్మల్ని ఏదో ఓటి చేసి పేరు ప్రతిష్ఠలు సంపాదించుకోనీయ్!"

"ఔను మమ్మీ!"

"ఓకె' అను మమ్మీ!"

ఎలెక్షన్లలో అరిచినట్టు అరవసాగారు ముగ్గురూ.

కొద్దిక్షణాలు ఆలోచించింది సుశీల. తాను ఆగ్రహం ప్రదర్శించినందువల్ల లాభం లేదని గ్రహించి, ప్రయత్న పూర్వకంగా శాంతం కొని తెచ్చుకున్నది.

"ఒక్కమాట నాదికూడ వినండి." అన్నది ఓ కుర్చీలో కూర్చుంటూ.

"ఓయస్! వెరీగ్లాడ్!" ఆమోదం వెలిబుచ్చారు సంతానం.

"మీరింతసేపు మాట్లాడారుకదా! ఇంగ్లీషుపదాల్లేని ఒక్క వాక్యమైనా మాట్లాడారా ఒక్కళ్ళైనా? అసలు మాట్లాడగలరా అని?"

"మేము అంగీకరించాం. అయితే వ్వాట్?"

"మరి మీవంటివాళ్ళకి అటువంటి ఆందోళనచేసే అర్హత వున్నదా అని?"

లక్ష్మీ తలవంచుకున్నా బాబీ రోజీలు చాకులాంటి సమాధానం యిచ్చారు. "ఎంత ఇన్నొసెంట్ మమ్మీ! గాంధీ భక్తులంతా కొల్లాయి కడ్తున్నారా? మద్యమాంసాలు

ఆరగించటం లేదా ? చూశావా ఎంత చక్కగా తెలుగు మాట్లాడామో !"

సుశీల విన్పించుకోలేదు. నవ్వును దాచుకో ప్రయత్నిస్తున్న భర్తదెస తిరిగింది. "ఉత్తరాదిన చదువులకు వెళ్ళి నరసింహారావు అనే చక్కటి పేరును 'సింహా'గా మార్చుకున్నారు మీరు. లక్ష్మి, సరోజిని అని చక్కటి పేర్లు నేను పెట్టుకుంటే వాటిని లక్కీ, రోజీలుగా మార్చిపారేశారు. చిన్నప్పట్నుంచి కాన్వెంటుల్లో చదివించి వాళ్ళకు మాతృభాష నేది రాకుండా చేశారు !"

"మమ్మీ ఉపన్యాసం యివ్వగల దన్నమాట !" లక్కీ ఆశ్చర్యం.

"మేం తెలుగు మాట్లాడుతూనే వున్నాంగా మమ్మీ?" రోజీ ఎదురుప్రశ్న.

"ఆహా ! చక్కటి అతుకుబొతుకుల భాష మాట్లాడ కేం ?" ఎగతాళిగా అన్నది సుశీల. "ముగ్గురిలోను ఒక్కళ్ళకి తెలుగురాయటం రాదు, అయినా మీవరకూ ఎందుకు ? మీ నాన్నకే రాదు. 'ఓ' అంటె 'న' వ్రాయడం. ఇటువంటి వాళ్ళంతా తెలుగును ఉద్ధరించుతా మనటానికి సిగ్గులేవూ ?... ఇన్నేళ్ళ మన వివాహ జీవితంలో ఒక్కసారైనా నాకు ఉత్తరం వ్రాయగలిగారా మీరు? కారణం-తెలుగు వ్రాయలేకేగా. మనుమలో మనమలో అని ముచ్చట పడిపోతుంటుంది మా అమ్మ. ఏదీ ఒక్కళ్ళు ఆవిడకి కాస్త

గౌరవంగా మురిపెంగా నాల్గు ముక్కలు రాయగల వాళ్ళు న్నారా? ఎందుకొచ్చిన కబుర్లివి సిగ్గులేక?... నేను బజారుపోతున్నాను. రాగలవాళ్ళురండి. తర్వాత నా ఎంపిక బాగు లేదంటే నేను చేయగలదేం లేదు."

"మేం రాము." ఏకగ్రీవంగా చెప్పేశారు.

"సరే. మీాయిష్టం. కానీ ఒక్కమాట - ఏం చేసుకున్నా ఎమర్జెన్సీ పిరియడ్ తర్వాత చేసుకోండి. లేకుంటే జైలు కెళ్తారు."

## 2

"అరె! ఇంకా ఇలాగే కూర్చుని వున్నారా?" బజారునుంచి తిరిగివచ్చిన సుశీల అడిగింది.

ఎవ్వరినుండీ సమాధానం లేదు. అంతా తీవ్రాలోచనలో వున్నారు. ఏమిటేమిటో రాసేస్తున్నారు సీరియస్‌గా. పరీక్షగా చూచింది సుశీల.

సుశీల మాత్రమే చదివే పెద్ద పెద్ద తెలుగు నవలలూ, గ్రంథాలూ, తన పుట్టింటి నుండి, అక్క చెల్లెళ్ళ నుండీ తెలుగులో వ్రాయబడి వచ్చే పాత ఉత్తరాలు కొన్ని సింహాటేబిల్‌పై నిండిపోయి వున్నాయి.

సంతానం ముగ్గురూకూడ ఏమిటో తీవ్రంగా తిరగేస్తు న్నారా పుస్తకాలను.

"ఏమిటిదంతా" మళ్ళీ అడిగింది.

"గొప్పగా సవాలు చేశావు కదూ నాకు తెలుగు వ్రాయటమే రాదని! అదేమిటో తెలుసుకుంటావని! మీ అమ్మగారికి ఉత్తరం వ్రాస్తున్నాను స్వచ్ఛమైన తెలుగు భాషలో!" తలెత్తకుండానే జవాబిచ్చాడు సింహా. "మా ఆందోళననూ, ఉద్యమాన్నీ ఎమర్జెన్సీ పిరియడ్ తర్వాతకు వాయిదావేశాంలే!"

వింటూనే విరగబడి నవ్వింది సుశీల. "మీరు తెలుగు వ్రాయడం — అందులోనూ అత్తగారికే?" మళ్ళా మళ్ళా నవ్వింది. "నేనున్నాను కనుక తెలుగు మాట్లాడటం వచ్చు కనీసం! అంతే."

"ఆహా! జోక్‌గానీ కాదు. నిజమే!" వ్రాసినదాన్ని గంభీరంగా చదివి చూచుకుంటూ అన్నాడు, "నేను వ్రాయ గలను."

"ఏదీ? ఏం రాశారో ముందు నన్నొక్కసారి చదివి తరించనీయండి. ఆ తర్వాతసంగతి చూద్దాం." చనువుగా ఉత్తరాన్ని తీసుకోబోయింది కానీ అతడివ్వలేదు.

"మధ్యలో నీ 'సెన్సారింగ్' అక్కర్లేదులే. చూస్కో అత్తగారి నుండి ఈ ఉత్తరానికి జవాబువస్తుంది. అప్పుడు తెలుస్తుంది నీకు నా తడాఖా!" సగర్వంగా చూశాడు.

ఈసారి ఇది నిజమే - హాస్యంకాదని తెలుసుకున్న సుశీలకు భయంకూడా కలిగింది. "చాల్లెండి, మీ తప్పుల తడకల భాషలన్నీ అంత పెద్దావిడ కెందుకు? ఆ ఇంగ్లీషు కలగా పులగం అర్థంకాక ఏమైనా అపార్థాలు కూడా వస్తాయి. ఇంకెవరికైనా రాసుకోండి, మా అమ్మకేం రాయక్కర్లేదు మీరు."

"మా అత్తగారికి నేను ఉత్తరం రాసుకుంటే మధ్యన వద్దనటానికి నువ్వెవరవ్? వెళ్ళు." సీరియస్‌గా అన్నాడు సింహం.

"ఔను. ఏం, డాడీకి ఆ మాత్రం రాదనుకున్నావా ఏం, మరీ అంత ఇది చేస్తున్నావ్?" లక్ష్మి తండ్రి పక్షం వాదించింది.

"అన్నిటికీ నీ ఇంటర్‌ఫెరెన్స్ బాగుండలేదు మమ్మీ." రోజీ బాబీలు విసుక్కున్నారు. "మేం చేయబోయేది ఎమర్జెన్సీ తీసేశాకలే, ఇప్పుడేకాదు. ఖంగారుపడకు."

"ఏదో బుద్ధితక్కువగా వాగుతుంటాను కానీ నామాట ఎప్పుడెవరు విన్నారు గనుక?" కోపంగా నిష్క్రమించింది సుశీల.

"మీ తప్పుల భాషంతా చూచి మణదళ్ళు తాటాకులు కడ్తారు. నాకేం?" అన్నది పోతూ పోతూ.

# 3

"ఏదీ మీ అత్తగారినుండి ఉత్తరం రాలేదేం ?" హాస్యంగా రోజూ అడుగుతూనే వున్నది సుశీల భర్తను.

"వస్తుంది వస్తుంది. అలాగే నవ్వుతూండు. నీకు అక్షింతలు కూడా వస్తూంటాయి బహుశః అందులో. జాగ్రత్తగా వుండు." సింహ సమాధానం అది.

"నాకెందుకు మధ్యన ?"

"ఈ కరువు రోజుల్లో 'ఆ ఖర్చూ ఈ ఖర్చూ' అంటూ అల్లుడిప్రాణం తియ్యకే అమ్మాయీ! అని......" రాయకరాయక ఇన్నాళ్ళకు అల్లుడుగారు అంత భక్తిశ్రద్ధలతో ఉత్తరంరాస్తే, అత్తమామలలో ఏ ఒక్కరూకూడ పదిహేను రోజులకూడా సమాధానం ఇవ్వకపోవటం అనేది సుశీలను అనేక విధాల కలవర పరచగా, "అసలేం రాశార్రా బాబీ మీనాన్న అమ్మమ్మకి ?" అని అడిగింది చాటుగా.

నెత్తిగోక్కుంటూ పైకీ క్రిందకీ చూచాడు బాబి.

"ప్రతి ఏడులాగా దీపావళికి రమ్మని పిలుపూ లేదు. మనం వెళ్ళకపోతే క్రొత్తబట్టలకంటూ డబ్బుపంపేది — మనియార్డరూ రాలేదు. రేపే దీపావళి! కొంపతీసి మీరంతా కలసి ఏమీ అవాకులూ చవాకులూ రాయలేదుకదా అమ్మమ్మకు కోపం వచ్చేట్లుగా? ఇరవై రోజులు కావస్తూన్నా

అటునుంచి ఉత్తరమే లేదు." అనుమానంగా అడిగింది మరోనాడు.

"తప్పులెందుకు రాస్తారూ?" అభిమానంగా అడిగాడు బాబి.

"ఎన్నో పెద్దపెద్ద పుస్తకాలూ, మనవాళ్ళనుంచొచ్చే తెలుగు ఉత్తరాలూ అన్నీ దగ్గఱ పెట్టుకుని చాలా శ్రద్ధగా వ్రాశారు. ఆ తెలుగు వాళ్ళ కర్థమై వుండదు- అంత హై లాంగ్వేజ్ !"

"ఖర్మ ! ఒక్క ఉత్తరం వ్రాయటానికి పెద్దపెద్ద పుస్తకాలు కావలసొచ్చాయా ? నాతో కాస్త తెలుగు మాట్లాడ్తూండబట్టిగానీ లేకుంటే ఆమాత్రమూ రాదు. తప్పకుండా ఏదో గడబిడే జరిగింది. ఏం రాశారో కాస్త వివరంగా చెప్పూ."

ఇబ్బందిగా చూచాడు బాబి. "మరీ నువ్వు మనుషుల్ని క్రిటికల్ కండిషన్‌లో పెట్టేస్తావ్ మమ్మీ. నాకు తెలుగు చదవడం రాదుగా ? ఏం రాశారో ఏం చెప్పనూ ? కానీ పెద్ద ఉత్తరమే రాశారు."

"సరేలే. ఫో."

# 4

“మేం కాండిల్స్ వెలిగించం, చెప్పాంగా? ఇవన్నీ అనవసర ఖర్చులనీ?” రోజీ భీష్మించు క్కూర్చుంది.

“నాకా బట్టలేం అక్కర్లేదు. హాయిగా అందరూ బెల్‌బాటమ్సూ, స్ట్రెచ్ పాంట్సూ వేస్తూంటే నువ్వు మా చేత ముసలమ్మల్లా చీరలు కట్టిస్తున్నావ్” కోపగించి కూర్చున్నది లక్కీ.

“ఫారినర్స్ చీరఅందం మరి దేనికీ లేదని ఒప్పుకొన్నారు. మిడిమిడి జ్ఞానాలతో మీరు నా ప్రాణాలు తీసేస్తున్నారు.” విసుక్కుంటూ తానే దీపాలు వెలిగిస్తున్నది సుశీల.

“ఇంతకూ అంతా మీ డాడీ ఇచ్చిన అలుసు మీకిది. పండగనాడు కడుపున పుట్టిన బిడ్డలే నామీద అలిగి కూర్చున్నారు.”

హాయిగా అటుఇటు తిరుగుతూన్న సింహా భార్య విసిరిన ఈ విసురును విని ఆగాడు, “సుశీ! పిల్లల యిష్టాన్ని కాదనవద్దని నీ కెన్నిసార్లు చెప్పాను? వాళ్ళ మనసులు అనవసరంగా నొప్పిస్తావ్. నేరం నామీదకు త్రోస్తావ్!”

దీపాలు వెలిగించడం పూర్తిచేసి హారతి ఈయబోతూన్న సుశీల ఆగి, పరీక్షగా చూచింది గుమ్మంముందు ఆగుతూన్న రిక్షాల దెస.

"ఎవరబ్బా ఇప్పుడొచ్చారూ ? ఇంతింత సామాను లతో ?" ఆశ్చర్యపూరిత స్వగతాన్ని పైకే అంటూండగానే, రిక్షానుంచి దూకినట్టే దిగింది శాంతమ్మ.

"అమ్మా !" ఆశ్చర్యంగా, సంతోషంగా అంటూ సుశీలా, "శుభం శుభం, అత్తగారా ?" అని మర్యాదగా ఎదురేగబోతూన్న సింహాకూడ ఒక్కసారిగా శిలలా స్తంభించిపోయారు, "నీ కెంత కష్టంవచ్చిందే తల్లీ?" అంటూ పరుగు పరుగునవచ్చి కుమార్తెను పట్టుకుని శోకాలు పెట్తూన్న శాంతమ్మనుచూచి.

"చీమకైనా హానిచేయని నీ ముఖాన ఎన్ని బాధలు రాశాడే తల్లీ మాయదారి దేవుడు ! ఎంత బెంబేలు పడిపోతున్నానో కదా ఒక్కతెవూనూ? తిరుపతి మొక్కు కున్నాను పిల్లలందరి తల నీలాలూ యిచ్చేస్తాం, త్వరగా బాగై పోతేనసీ... హరి భగవంతుడా... వింటున్నావా నా మొరా..." తిరిగి సన్నగా రాగం ప్రారంభించింది.

రోజీ, లక్కీ, బాబీ బిక్కముఖాలు వేసుకు నిలబడ్డారు. ఇరుగు పొరుగు లంతా గుమిగూడారు.

"ఎవరికండీ ? ఏమిటి జబ్బా ?" ఒక్కొక్కరే పరామర్శించసాగారు.

"అయ్యో నాయనా, మీకెవరికీ తెలియనే తెలి యదా? ఔను, ఎలా తెలుస్తుందీ? అదెవరికైనా నోరువిప్పి

చెప్పుకోనే రకమైతేగా? కన్నతల్లినైన నాకే నాలుగుముక్కలు రాసిందికాదు. నా గుండె పగిలిపోతుంది దేముడా!"

తల్లి ఎందుకేడుస్తోందో తెలియని సుశీలకూ్కడా కళ్ళు చెరువులు కాసాగాయి.

"మరీ అంత ఇదైపోకమ్మా. నెమ్మదిగా చెప్పు. దా లోపల మాట్లాడుకుందాం." అన్నది ఎలాగో సుశీల.

"ఫర్వాలేదులే తల్లీ." నెత్తిన చేతులతో కూల బడింది శాంతమ్మ. "ఇటువంటివి దాచుకుంటే దాగుతాయా? ఒక్కో మనిషికి ఒక్కో రోగమూ తెగులూనూ. సిగ్గుపడితే ఎలాగ? ఆ డాక్టరా, ఈ మందా అని త్వరగా తగ్గేదారి చూచుకోవాలిగానీ యిలా ఇంట్లో పెట్టుకొని ఎన్నాళ్ళు క్రుళ్ళుతావూ?"

ఏమీ అర్థంకాని సుశీల కనుపాపలు కదలక నిలబడి పోయాయి.

"ఔనమ్మా సుశీలా!" అంతవరకూ మాట్లాడకుండా కాస్తదూరంగా నిలబడ్డ సుశీల తండ్రి రాఘవరావు కల్పించు కున్నాడు. "పద త్వరత్వరగా కావలసినవన్నీ సర్దు. విశాఖ పట్టణం తీసుకుపోదాం. ఇంతకూ బండి ఎప్పుడో?"

"ఇంతకూ అసలు సంగతేమిటి అత్తగారూ?" సింహా శాంతమ్మ దగ్గరకు వస్తూ అడిగాడు. "ఇంకా ఇవాళా రేపూ మీ ఉత్తరం వస్తుందని చూస్తుంటే మీరే..."

సింహా మాటలకు ఉలిక్కిపడి, ఏడుపు మానివేసి, ఛెంగున గంతి సుశీల వెనక దాక్కున్నది శాంతమ్మ.

ఏదో క్రూరమృగాన్ని చూస్తున్నట్లుగా చూస్తూ పరిగత్తి వీధి గేటుదగ్గర నిలబడ్డాడు రాఘవరావు. అర్థంకాక ఎగాదిగా చూస్తూన్న జనాన్ని ఉద్దేశించి అన్నాడు:- "అమావాస్యపూటకూడానూ, బొత్తిగా అలా వదిలేసేరేమిటీ నలుగుర్లోనూ? ఓ గదిలో పెట్టి తాళం వేయాలి. లేకపోతే చాలా ప్రమాదం!" అంటూనే అల్లుడిదెస బెదురుచూపులు చూడసాగాడు.

శాంతమ్మ కూతురి వెనకనక్కి భయం భయంగా చూస్తున్నది.

చుట్టూ చేరిన జనమంతా ఏమిటో రణగొణధ్వనిగా మాట్లాడుకుంటున్నారు.

సుశీలకు ఏదో స్ఫురించగా, తల్లిదెస తిరిగి నిదానంగా అడిగింది. "నువ్వసలు సంగతి చెప్పకుండా నా మతి పోగొట్టేస్తున్నావమ్మా. నాకే కష్టమూ రాలేదు. మేం హాయిగా వున్నాం. నీ కెవరైనా ఇష్టంలేనివాళ్ళు ఏమైనా రాశారేమో ఖంగారు పెట్టటానికి. అంతే."

నిర్ఘాంతపోయిన శాంతమ్మ అంతలోనే తేరుకున్నది. "ఎవళ్ళో వ్రాస్తే ఎందుకు అనుకోవడం? అల్లుడుగారే

స్వయంగా వ్రాశారు చూడవే అమ్మా. ఇంత కొంప మునిగినా నువ్వు తెలుసుకోకుండా ఎలాగున్నావే వెర్రితల్లీ."

శాంతమ్మ మరలా సన్నగా రాగాలు తీస్తుంటే రాఘవ రావు ముందుకువచ్చి ఓ వుత్తరం కూతురు చేతికి అందించి, మరలా పారిపోయి గేటు బయట నిలబడ్డాడు. ముఖాన చెమటలు అద్దుకుంటూ.

సుశీలతోపాటు ఆమె చుట్టూ గుమిగూడిన ఇరుగు పొరుగులుకూడా చదివేశారా వుత్తరాన్ని.

"ప్రియమైన అత్తగార్కి!

చిరంజీవి సౌభాగ్యవతిగా, పుత్ర పౌత్రాభిసిద్ధిరస్తుగా ఆశీర్వదించి మీ అల్లుడుగారు వ్రాసేది. ఇక్కడంతా క్షేమము, మీ క్షేమములు తెలుపవలెను. గంగా భగీరథీ సమానులైన మామగారికి మా శ్రద్ధాంజలులు. లక్ష్మీ సమానురాలైన మరదలికి నమస్కారములు. మహారాజశ్రీ మా చిన్న బావమరది ఇంటర్ పాసైనట్లు వ్రాశారు. అభివాదనులు. బాగా చదవమనండి. ఇక్కడ మీ మనవలు చాలా గొప్ప తెలివితేటలతో ప్రకాశించుచున్నారు. దీపావళి నరకుడి తద్దినమే కదా-అంచేత ఇకనుంచి ఈ పండుగ తద్దినాలు ఆపివేద్దామని పిల్లలు తీర్మానించారు. వాళ్ళ తలలో అంత గొప్ప తెలివి నిండి వున్నందుకు మీ సుశీల సంతోషించుటలేదు. పిల్లలను చాలా ఆశాభంగము కావించినది. అందువల్ల మీరొక జాబు వ్రాసి మీ అమ్మాయికి నచ్చ

చెప్పండి. భావి భారత పౌరులను అమ్మా నాన్నలు అలా బాధపెట్టి భయపెట్టే హక్కులేదు. కనుక మీ అమ్మాయి మాట చెల్లదు. మెజారిటీ ఓట్లులేవు. అందువల్ల మీ సుశీల మాట చెల్లబోదు. ఈ పండుగ తద్దినాలు కట్టిపెట్టమని మీ అమ్మాయికి గట్టిగా వ్రాయండి. లేదా ఈ గృహ స్వర్గధామ ముందు అశాంతి నెలకొనగలదు.

"చిరంజీవులు మా వదినగారు పండుగకు వచ్చారా? ఆమెగారికి మా ముద్దులు. వారి పిల్లలకు ప్రణామములు. కీర్తిశేషులైన మా తోడల్లుడుగారుకూడా పండుగకు వేంచేశారా ? మరీమరీ అడిగామని విన్నవించుకో గలరు. వెంటనే జవాబీయండి.

నమస్కారములతో తమ విధేయుడు.

భవదీయ అల్లుడుగారు, శ్రీ సింహా.

కళ్ళుతిరిగినట్లే అయిపోయిన సుశీల ఆ లేఖనూ భర్తనూ మార్చిమార్చి చూడసాగింది అయోమయంగా.

"ఏనాడూ బావమఱదులతోనైనా హాస్యాలాడని వాడు—ఇన్ని అవాకులూ చవాకులూ వ్రాశాడంటే—ఇంకే ముందే తల్లీ-కొంప మునిగిపోయిందే..." శాంతమ్మ మఱలా దీర్ఘాలూ, శోకాలూ విన్పించుతోంది.

రాఘవయ్య అంటున్నాడు. "ఏనాడూ అసలు తెలుగే వ్రాయని మనిషి—తెలుగును ఏవగించుకునేవాడు. అందరి పట్లా ఎంత పెద్దమనిషి తరహాగా ఎంత మన్ననతో ప్రవర్తించే

వాడు! బాగా చదువుకున్న పండితులందరికీ ఇలాగే మతి చలించటమో, పరాకు రావటమో జరుగుతుంటుందట. నాకు తెలిసిన ఓ పెద్ద తెలుగు పండితుడికి ఒక్కరోజులో పిచ్చెక్కి, తెలుగు శాస్త్రాలన్నీ మఱచిపోయి ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడటం మొదలుపెట్టాడు. ఒక వీణావాయిద్య నిపుణుడు మతిపోయి, వీణను మఱచి ఎన్నడూ తాకనైనా తాకని వయొలిన్ అద్భుతంగా వాయించటం మొదలు పెట్టాడు... పదమ్మా సుశీలా విచారించి ఏంలాభం? అన్నీ సర్దు వైజాగ్ పోదాం."

"కాస్త అతడిని గదిలో పెట్టి తాళం వేయండి. అమా వాస్యపూటా!"

'తెలుగు ఉత్తరాలూ, గ్రంథాలూ సహాయంతో ఆనాడతడు వ్రాసిన ఉత్తరం యిదా ?' దేశం మొత్తంమీద కాకున్నా, కనీసం ఆ వీధిలో ఈ విధంగా పేరు ప్రఖ్యాతులు పొందిన భర్తను చూచి ఏడవాలో నవ్వాలో తెలియలేదు సుశీలకు.